# మీసేవా కేంద్రాలకు పోటెత్తిన జనం

నార్కట్‌పల్లి, డిసెంబర్ 28 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ పథకాలకు ఆధార్‌కార్డు, కుషన్‌కార్డు తప్పనిసరి చేయడంతో వాటి కోసం ప్రజలు మీ సేవా కేంద్రాలకు పోటెత్తారు. ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ, వాటికి జత చేయాల్సిన ధ్రువ పత్రాలపై అధికారులు అవగాహన కల్పించకపోవడం, ప్రజా పాలన ఎప్పుడెప్పుడు నిర్వహిస్తారనేది స్పష్టంగా తెలుపక పోవడంతో ప్రజలు ఇప్పుడే దరఖాస్తు చేసుకోవాలనే ఉచ్చుకతతో ధ్రువ పత్రాల కోసం హైరానా పడ్డారు. ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయించుకునేందుకు పోటీ పడ్డారు. ఉదయం నుంచిమీసేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు.



నార్కట్‌పల్లి మీ సేవా కేంద్రం వేచి ఉన్న ప్రజలు




దామరచర్లలో ఆధార్ కేంద్రంలో వేచియున్న జనం

## ఆధార్ అప్‌డేట్‌కోసం నిరీక్షణ

దామరచర్ల : అభయహస్తం పథకాలకోసం అందజేసే దరఖాస్తులకు ఆధార్, రేషన్‌కార్డుల ప్రతులను జతపర్చాలని నిబంధన పెట్టడంతో గ్రామాల్లో ఆధార్‌కార్డులు లేని వారు, కార్డులు అప్‌డేట్ చేసుకోని వారు దామరచర్ల మండల కేంద్రంలోని ఆధార్‌నమోదు కేంద్రానికి క్యూకట్టారు. రేషన్ కార్డులకు సరైన కౌంటర్ ఏర్పాటు చేయక మీ సేవా కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో మీసేవా కేంద్రాల వద్ద ప్రజలు బారులు దీరారు. రేషన్‌కార్డుకు ఆధార్ తప్పని సరి కావడంతో ఆధార్ కేంద్రం వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిన్ని పిల్లలతో నిరీక్షణ చేయాల్సి వచ్చింది. ఆధార్ కేంద్రం వద్ద సర్వర్ డౌన్ కావడంతో ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాశారు.

## బీఆర్‌ఎస్ నేతలపై కాంగ్రెస్ గూండాల దాడి దుర్మార్గమైన చర్య

(మొదటి పేజీ తరువాయి)

తగాదాలతో గ్రామాలు వల్లకాడులైన గత చరిత్ర నల్లగొండ జిల్లాది అని తెలిపారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాజకీయ ఘర్షణలకు తావు లేకుండా చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో రాజకీయ దాడులను ఆపాల్సిన బాధ్యత జిల్లా మంత్రులది, పోలీసు అధికారులదేనని చెప్పారు. బీఆర్‌ఎస్ శ్రేణులు ఇలాంటి చిల్లరవాటికి ఆవేశానికి లోనుకావద్దని కోరారు.

### స్థానిక ప్రజా ప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా ?

కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం స్థానిక సంస్థలకు కనీస గౌరవం ఇవ్వలేదని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన పేరుతో చేపడుతున్న కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయిలో ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని చెప్పి, ఆ కార్యక్రమాన్ని రద్దు చేయడమే దానికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు స్థానిక సంస్థలను బలోపేతం చేస్తామన్నారని, కానీ నేడు వాటికి గౌరవం ఇవ్వడం లేదని తెలిపారు. మరోవైపు ప్రజాపాలన సభల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీ పథకాలు అమలయ్యేలా, స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

## ఉపాధ్యాయురాలిపై డీఈఓకు ఫిర్యాదు

బీబీనగర్, డిసెంబర్ 28 : మండలంలోని కొండమడుగు ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలు కృష్ణవేణి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాల విద్యార్థిని తండ్రి జిన్న వెంకటేశ్ గురువారం డీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న తన కూతురు ప్రణవి ఈనెల 21న హోం వర్క్ చేయడం ఆలస్యం అవడంతో చేతితో బలంగా కొట్టడం వల్ల తీవ్రంగా గాయపడింది. తన కూతుర్ని గాయపరిచిన ఉపాధ్యాయురాలుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మొక్కుబడిగా రాజాపేట మండల సమావేశం

రాజాపేట, డిసెంబర్ 28 : మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశం మొక్కుబడిగా కొనసాగింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు కొంతమందే హాజరయ్యారు. అన్యాక్రాంతమైపోతున్న ప్రభుత్వ, ఆలయ భూములు సంరక్షించాలని ఎంపీటీసీలు కోరారు. గ్రామాల్లో ఇనుప స్తంభాలను తొలగించాలని, ఉపాధిహామీ పథకంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను చెల్లించాలని కోరారు. సమావేశంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మోత్కుపల్లి జ్యోతి, జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్, డిప్యూటీ తాసీల్దార్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు దాచపల్లి రాజు, పారుపల్లి సుమలత, ల్యాగల శ్రీలత, బుడిగే రేణుక, స్వరూప, మౌనిక, సర్పంచులు వంచ వీరారెడ్డి, గుంటి మధుసూదన్ రెడ్డి, ఠాకూర్ ధర్మేందర్‌సింగ్, గాడిపల్లి శ్రవన్‌కుమార్, మెండు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో విద్యాశాఖ నివేదికను వినిపిస్తున్న ఎంఈఓ నాగార్జున

## కంబాలపల్లి లిఫ్ట్ భూముల పరిశీలన

చందంపేట, డిసెంబర్ 28 : చందంపేట మండలంలోని కంబాలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన భూములను గురువారం అటవీ, ఇరిగేషన్ శాఖల అధికారులు పరిశీలించారు. కంబాలపల్లి లిఫ్ట్ పనులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో అటవీ శాఖ భూములను గుర్తించి హద్దులను నిర్ధారించినట్లు ఐఎఫ్ఓ రాజ్‌నాథ్, ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనాథ్ తెలిపారు. అటవీ శాఖ పరిధిలో ఎంత మేర భూమి లిఫ్ట్‌కు వర్తించనుందనేది నిర్ధారించడం కోసం భూ పరిశీలన చేపట్టినట్లు అధికారులు చెప్పారు. వారి వెంట ఇరిగేషన్ శాఖ డీఈ మనోహర్, ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, ఎఫ్ఆర్ఓ సాయిప్రకాశ్, ఏఈ శివరాజ్ తదితరులు ఉన్నారు.



అటవీ భూములను పరిశీలిస్తున ఐఎఫ్ఓ రాజ్‌నాథ్, ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనాథ్

## రోగి నగలు అపహరణ

నందికొండ, డిసెంబర్ 28 : నందికొండలోని కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి నగలు అపహరించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌కాలనీకి చెందిన రమణమ్మ (60) అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకోసం ఈ నెల 17న దవాఖానలో చేరింది. షుగర్ ఎక్కువ కావడంతో అప్పటి నుంచి కోమాలో ఉంది. చికిత్స పొందుతూ 22న మృతి చెందింది. దవాఖానకు వచ్చినప్పుడు రమణమ్మ ఒంటిపైన 8 తులాల బంగారం ఉందని, చనిపోయినప్పుడు చూస్తే లేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అమె అల్లుడు రామ్మోహన్‌రావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ బీసన్న కేసును విచారిస్తున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సీఎంఓ భానుప్రసాద్‌ను వివరణ కోరగా వారు ప్రత్యేకంగా గది తీసుకున్నారని, కుటుంబ సభ్యులు కూడా ఆమె వద్దే ఉన్నారని తెలిపారు. ఈ విషయమై పోలీసుల విచారణలో సహకరిస్తామన్నారు.

# కాల్వల పెండింగ్ పనుల నివేదికను అందజేయాలి

- కలెక్టరేట్‌లో అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి
- పనుల పురోగతి, భూ సేకరణ వివరాలపై ఆరా

భువనగిరి అర్బన్, డిసెంబర్ 28 : జిల్లాలో బస్వాపూర్ రిజర్వాయర్ ప్యాకేజీ, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, భీమలింగం కాల్వపనులు పురోగతి, బునాదిగాని కాల్వలకు సంబంధించిన భూసేకరణ పెండింగ్ పనుల నివేదికను వెంటనే ప్రభుత్వానికి అందజేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం భువనగిరి నియోజకవర్గ పరిధిలోని కాళేశ్వరం ప్రాజెక్టు బస్వాపూర్ రిజర్వాయర్, ప్యాకేజీ, బునాదిగాని కాల్వ, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, భీమలింగం కాల్వల పనుల పురోగతి, వాటికి సంబంధించిన భూసేకరణ వివరాలను, ఇరిగేషన్ శాఖ పనులపై జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ ఏ.భాస్కరరావు, నీటి పారుదల శాఖల అధికారుల తో సమీక్షించారు. బస్వాపూర్ రిజర్వాయర్, కెనాల్ పనులకు సంబంధించిన భూసేకరణ పనులపై తగు సూచనలు చేశారు. బునాదిగాని కాల్వ 42 కిలో మీటర్ వరకు, 42 నుంచి 98 కిలో మీట ర్ వరకు పెండింగ్ అంచనా ప్రతిపాదనలను పంచాలన్నారు. అలాగే పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వల సమగ్రమైన ప్రతిపాదనలను తయారుచేసి పంపాలని సూచించారు. బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన బీఎన్. తిమ్మాపూర్‌కు సంబంధించిన గ్రామ కంఠం భూసేకరణ కోసం రూ. 110కోట్లు, వ్యవసాయ భూముల నష్టపరిహారం కోసం రూ.102.48కోట్లు, హుస్సేనాబాద్ ఆర్ అండ్‌ఆర్ కాలనీ కోసం రూ.50 కోట్లు నిధులు అవసరమని అధికారులు నివేదించారు. సమీక్షా సమావేశంలో ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్, చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు, ఆర్డీఓ అమరేందర్, ఈఈ ఇరిగేషన్, ఎస్‌డీసీ అధికారులు పాల్గొన్నారు.

## తైక్వాండ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

భువనగిరి అర్బన్, డిసెంబర్ 28: రాష్ట్రస్థాయి తైక్వాండ్ పోటీలు ఈనెల 27, 28న పట్టణంలో నిర్వహించారు. ఇందులో ప్రతిభకనబరిచిన క్రీడాకారులకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి గురువారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తైక్వాండో క్రీడతో శరీర దృఢత్వంతో పాటు విద్యా ఉద్యోగాలలో ఎంతగానో ఉపయోగపడుతుందని, మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. ఈ పోటీలలు పతకాలు సాధించిన క్రీడాకారులు రాజస్థాన్‌లో జనవరిలో జరిగే నేషనల్ మీట్‌లో పాల్గొంటారని తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కే.శ్రీహరి తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు కే.శ్రీకాంత్, సైదులు, రవికుమార్, ఆర్.వినోద్, పి.వెంకటేశ్, కే.కుమార్, ఎన్.బాలకృష్ణ, పి.సనిత్ కుమార్, ప్రశాంత్, ఎస్.విశాల్, అనిల్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సునీత

## విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్ 28 : విద్యాభివృద్ధికి దాతలు సహకారం అభినందనీయమని సర్పంచ్ ఆకుల సునీతాశ్రీకాంత్ అన్నారు. దివీస్ ఆధ్వర్యం లో మండలంలోని ఎస్.లిం గోటం హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, పాదరక్షల పంపిణీ, ఉచిత వైద్యశిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జయంత్‌కుమార్, దివీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 28 : మండల కేంద్రానికి చెందిన ఉగ్గే భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. అతడితో 10వ తరగతి చదువుకున్న స్నేహితులు గురువారం భిక్షపతి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.40వేలతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో పొన్నగాని జహంగీర్‌గౌడ్, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుమలత, స్వామి, శ్రీనివాస్, శ్రీశైలం, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, శ్రీను పాల్గొన్నారు.

## నేడు నకిరేకల్ మండల సర్వసభ్య సమావేశం

నకిరేకల్, డిసెంబర్ 28 : మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాళ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.